క్లుప్తంగా

తండ్రి వారసత్వాన్ని నిలిపిన కుమారుడు



మోసిన్ షరీఫ్‌కు స్వీట్ తినిపిస్తున్న తండ్రి

నకిరేకల్ : నకిరేకల్‌లోని సంతోష్‌నగర్‌కు చెందిన ఎండీ మోసిన్ షరీఫ్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించారు. జోనల్ స్థాయిలో మోసిన్ షరీఫ్ 14వ ర్యాంకు సాధించారు. తండ్రి యాసిన్ షరీఫ్ రిటైర్డు ఎస్‌ఐ. తన తండ్రి వారసత్వాన్ని కుమారుడు నిలబెట్టడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మోసిన్ షరీఫ్ మాట్లాడుతూ తన విజయానికి తన తండ్రి స్ఫూర్తి అని అన్నారు. తన తండ్రి ఎస్‌ఐ, తాత కూడా పోలీస్ శాఖలో పని చేశారని తెలిపారు.

కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎస్‌ఐగా ఎంపిక



విజయ

మునుగోడు : మండల కేంద్రానికి చెందిన గంజి విజయ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించినది. 2012లో ఎంఎస్సీ, బీఈడీ పూర్తిచేసిన ఆమె 2013లో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న చిట్టిపోలు రమేష్‌ని వివాహం చేసుకుంది. 2018లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలకాగా మొదటి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి ప్రస్తుతం చండూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. ఓవైపు ఉద్యోగం చేస్తూ ఈ ఏడాది నిర్వహించిన ఎస్‌ఐ పరీక్షలు రాసి సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించినది.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ కర్ణన్‌తో గిరిజన నాయకులు

నల్లగొండ : గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు మంగళవారం కలెక్టర్ ఆర్‌వి కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్–2 పరీక్షకు ముందు గురుకుల పరీక్షలు, తర్వాత జేఎల్ వంటి పోటీ పరీక్షలు ఉండడంతో పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు వీల్లేకుండా పోయిందన్నారు. ఈ రెండు పరీక్షల తర్వాతే గ్రూప్–2 పరీక్ష నిర్వహించాలని కోరారు.

ముస్లిం మైనార్టీలకు రూ.20వేల కోట్లు ప్రకటించాలని..

రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు రూ.20వేల కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ కర్ణన్‌కు యునైటెడ్ ముస్లిం మైనార్టీ హక్కుల సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ యూసఫ్ వినతిపత్రం అందజేశారు. బహుజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, మైనార్టీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

గురుకుల సమస్యలు పరిష్కరించాలని..

నల్లగొండ టౌన్ : జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు అభివృద్ధి పథకాల్లో గిరిజనులకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంగోతు ప్రవీణ్‌నాయక్ మంగళవారం కలెక్టర్ కర్ణన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను, అదనపు కలెక్టర్లను సన్మానించారు. నాగార్జుననాయక్, కేతావత్ నగేష్‌నాయక్, లచ్చునాయక్, కొర్ర అమర్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని కేటాయించాలని ఎంఈఓకు..

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై నియమించాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం నాయక్ మంగళవారం ఎంఈఓ గురువారావుకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో సుమారు 150 మంది విద్యార్థులు చదువుతున్నారని, పిల్లలకు గుణాత్మక విద్య అందించేందుకు ఉపాధ్యాయుల కొరత ఉందని వివరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

రామగిరి (తిప్పర్తి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై తిప్పర్తి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండల పరిధిలోని వంగమర్తి గ్రామానికి చెందిన భాషనబోయిన మహేష్, దొండ తరుణ్ ఇరువురు రెండు నంబర్ లేని నూతన ట్రాక్టర్లతో వంగమర్తి నుంచి తిప్పర్తి మండలం ఇండ్లూరు గ్రామానికి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. తిప్పర్తి పోలీసులు ఇండ్లూరులో ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధర్మ తెలిపారు.

గడువు పెంచాలి

చిట్యాల : గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు మరో వారం రోజుల పాటు పొడిగించాలని నకిరేకల్ నియోజకవర్గ బీజేపీ ఓబీసీ మోర్చా కన్వీనర్ గరిషే రవికాంత్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అతి తక్కువ కాల వ్యవధిలో తగిన ధృవీకరణ పత్రాలతో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించడం తగదన్నారు.

ముగిసిన 'తొలిమెట్టు' శిక్షణ

- పిల్లల్లో బోధన, అభ్యసన సామర్థ్యాలు పెంచేలా కార్యాచరణ
- గతేడాది సత్ఫలితాలు రావడంతో కొనసాగిస్తున్న విద్యాశాఖ



నకిరేకల్‌లో శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు	1,256
శిక్షణ పొందిన ఎస్‌జీటీలు	2,617
1 నుంచి 5 తరగతుల విద్యార్థులు	53,000

నకిరేకల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో బోధన, అభ్యసన సామర్థ్యాలు పెంచేలా ఉపాధ్యాయులకు ఈ ఏడాది కూడా తొలిమెట్టు కార్యక్రమం కింద మళ్లీ శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలల్లో బోధన, అభ్యసన ప్రక్రియ నిర్వహణకు వీలుగా ప్రణాళికలు రూపొందించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి కరదీపికలు అందిస్తున్నారు. గతేడాది నిర్వహించిన తొలిమెట్టు కార్యక్రమం ద్వారా సానుకూల ఫలితాలు వచ్చాయి. దీంతో ఈ విద్యా సంవత్సరం కూడా తొల్లిమెట్టు శిక్షణపై విద్యాశాఖ దృష్టి సారించింది. దీంట్లో భాగంగా ఈ నెల 2వ తేదీ నుంచి మండల స్థాయిలో ఎస్‌జీటీలకు ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది

సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్ల చేత శిక్షణ

ఉపాధ్యాయులకు బోధనా ప్రణాళికలు, విద్యార్థుల అభ్యాస పుస్తకాలపై అవగాహన కోసం జిల్లాస్థాయిలో ప్రతి మండలం నుంచి తెలుగు, ఆంగ్లం, గణిత సబ్జెక్టులకు ఇద్దరు చొప్పున రిసోర్స్ పర్సన్లను గుర్తించి జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశిక్షణ కేంద్రం (డైట్)లో గతనెల 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు మండల స్థాయిలో ఈ నెల 2వ తేదీ నుంచి ప్రతి సబ్జెక్టుకు రెండు రోజుల చొప్పున శిక్షణ ఇచ్చారు. ప్రతి పాఠశాల నుంచి కనీసం ఒక ఉపాధ్యాయుడికి ఒక సబ్జెక్టుపై, ఒక పాఠశాలలో ఇద్దరు కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న చోట రెండు సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చారు.

బోధనా ప్రణాళికల కరదీపికలు..

ప్రణాళికాబద్ధంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించడానికి జూన్ నుంచి పనిదినాలు రూపొందించారు. ఒక వారంలో ఐదు రోజుల బోధనాభ్యసన ప్రక్రియ నిర్వహిస్తే ఆరో రోజు బోధించిన అంశానికి సంబంధించి అభ్యసన ఫలితాలు ఏ మేరకు సాధించారో తెలుసుకోవడానికి మూల్యాంకనం చేస్తారు. ఇక ఈ విద్యా సంవత్సరంలో 140 పని దినాలను బోధనాభ్యసన ప్రక్రియ కోసం కేటాయించారు. ఉపాధ్యాయులు తమ రోజు వారీ బోధనాభ్యసన ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించడానికి వీలుగా అన్ని తరగతుల కోసం ప్రణాళికలను రూపొందించి బోధన ప్రణాళికల కరదీపికలు అందించారు.

విద్యార్థులకు అభ్యాసన పుస్తకాలు..



తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులకు సంబంధించిన అభ్యాసన పుస్తకాలను ఇప్పటికే విద్యార్థులకు అందజేశారు. ఏరోజు చెప్పిన పాఠ్యాంశానికి సంబంధించిన కృత్యాలు అదే రోజు విద్యార్థులు అభ్యాసన పుస్తకాల్లో చేసేలా రూపొందించారు. ఐదు రోజుల బోధనకు సంబంధించిన పాఠ్యాంశ కృత్యాలు నీలి రంగులో, ఆరో రోజు మూల్యాంకనానికి వారాంతపు పరీక్ష పత్రాలు గులాబీ రంగులో తయారు చేశారు. ఇవి విద్యార్థులకు ఉపయోకరంగా ఉన్నాయని ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు.

బోధనా ప్రణాళికలతో ఉపయుక్తం



మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధనలో భాగంగా పిల్లలు చదవడం.. రాయడం చేయగలిగేలా బోధనా ప్రణాళికలు ఉపయోగపడతాయి. వీటి ఆధారంగా రోజువారీ బోధనాంశలోని సూక్ష్మ సామర్థ్య అంశాలను సాధించవచ్చు. టీచర్ అభ్యాసన ఆధారిత బోధనకు సులభతరం అవుతుంది. ఉపాధ్యాయుడి పని భారాన్ని తగ్గించి పిల్లల్లో అభ్యసనా ఫలితాల సాధనకు మార్గం సుగమం చేస్తుంది.

– నర్సింహమూర్తి, రిసోర్స్ పర్సన్, నకిరేకల్

విద్యార్థుల ప్రగతి కోసమే శిక్షణ



ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రగతి కోసం ఎస్జీటీలకు తొలిమెట్టు కింద శిక్షణ ఇస్తున్నాం. గతేడాది సానుకూల ఫలితాలు రావడంతో ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తున్నాం. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు చక్కటి బోధనా సామర్థ్యాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కారక్రమాన్ని కొనసాగిస్తోంది.

– చంద్రయ్య, తొలిమెట్టు కార్యక్రమ జిల్లా సమన్వయ అధికారి

కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు కసరత్తు

మునుగోడు : మండలంలోని రెండు ఆవాస గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. మండల వ్యాప్తంగా ప్రస్తుతం 26 గ్రామ పంచాయతీలతో పాటు 37 ఆవాస గ్రామాలు ఉన్నాయి. అందులో పులిపలుపుల గ్రామ పంచాయతీ పరిధిలోని బీరేల్లిగూడెం, కల్వలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాశవారిగూడెం ఆవాస గ్రామాలను గ్రామ పంచాయతీలుగా మార్చేందుకు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సూచన మేరకు మండల అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు సమాచారం.

ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



కట్టంగూర్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కట్టంగూర్ : ఈ నెల 12న జిల్లా కేంద్రంలో, సెప్టెంబర్ 1న హైదరాబాదులో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం మండలంలోని దుగినవెల్లి ఉన్నత పాఠశాలలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. అయిటిపాముల కాంప్లెక్స్ హెచ్ఎం వై శంకరయ్య, రాధిక, మిట్టపల్లి మురళయ్య, ఇమ్మడి జగతి, రాంమోహన్, నాగలక్ష్మి, లలిత, జ్యోతి, నర్సయ్య, రాజేశ్వరి, వాణి, పోశం సైదులు ఉన్నారు.

మునుగోడు : విద్యారంగంలో నెలకొన్న సమస్యలతోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న నల్లగొండలో నిర్వహించే మహాధర్నాకు ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని ఉపాధ్యాయ సంఘం జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం మునుగోడు విద్యా వనరుల కేంద్రం ఎదుట మహాధర్నా పోస్టర్‌ను వారు విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు కె.రత్నయ్య, గేర నర్సింహ, ఉపాధ్యాయులు గోరెంట్ల సుధాకర్, బ్రహ్మచారి, అంజయ్య, భాస్కర్, సైదులు, రవీందర్, వివేకానంద, వెంకటయ్య, పారిజాత, కృప తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : ఈ నెల 12న జిల్లా కేంద్రంలో చేపట్టనున్న ర్యాలీలు, ధర్నాలు, సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ఉపాధ్యాయుడు కె.భిక్షమయ్య, పి.పరమేశ్వరి, ఎం.వెంకటేశ్వర్లు, పి.స్వప్న పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌ను మంగళవారం డీఈఓ భిక్షపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని గఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా డిజిటల్ తరగతుల నిర్వహణనుగ పరిశీలించారు. పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఆనంతరం ఆయన మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం సీహెచ్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నకాపర్తిలో డిజిటల్ క్లాస్ బోధన తీరును పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

మునుగోడు గ్రంథాలయానికి కొత్త శోభ



రెండు నెలల క్రితం గ్రంథాలయం



ప్రస్తుతం ఇలా..

మునుగోడు : మండల కేంద్రంలోని గ్రంథాలయం కొత్త శోభ సంతరించుకుంది. 2001లో నిర్మించిన ఆ గ్రంథాలయానికి తిరిగి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో స్లాబ్ పైభాగంలో పెచ్చులూడి వర్షం వచ్చినప్పుడు కురవడంతోపాటు రంగులు వేయకపోవడంతో పాతబడింది. వర్షం వచ్చిన సమయంలో కురవడంతో అందులోని పుస్తకాలు చాలావరకు తడిసిపోయాయి. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ఇబ్బందులు పడేవారు. విషయం తెలుసుకున్న మునుగోడు–1 ఎంపీటీసీ బొడ్డు శ్రావణినాగరాజుగౌడ్ తన ఎంపీటీసీ నిధులు రూ. 3.50 లక్షలు కేటాయించి పూర్తిస్థాయిలో గ్రంథాలయానికి మరమ్మతులు చేయించారు. దీంతో మునుగోడు గ్రంథాలయం నూతన శోభ సంతరించుకుంది. ఇటీవల పనులు పూర్తికావడంతో త్వరలో స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి చేతుల మీదుగా గ్రంథాలయాన్ని పునః ప్రారంభించనున్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



నకిరేకల్ : ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న దాతలు

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని తిప్పర్తి రోడ్డులో గల కేంద్ర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రవి ఫొటో స్టూడియో యాజమాని వేణుమాధవ్–లక్ష్మి దంపతులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 200 స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు రాగి జావ అందజేసే కార్యక్రమాన్ని ఎంఈఓ మేకల నాగయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం పోతుల గోపాల్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షురాలు కడారి అనిత, జి. కృష్ణవేణి పాల్గొన్నారు.

కనగల్‌లో..

కనగల్ : మండల పరిధిలోని దోరెపల్లి ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు హెచ్ఎం సంజాత బంధువులు ఆర్ లక్ష్మమ్మ భర్త కృష్ణారావు జ్ఞాపకార్థం మంగళవారం స్టీల్ గ్లాసులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు రాగిజావ అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ అయితగోని యాదయ్యగౌడ్, హెచ్ఎం సంజాత, ఉపాధ్యాయులు నిర్మల, రజిత, ఐఆర్పీ సతీష్‌లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ప్రతిఒక్కరూ పరిరక్షించాలి



మాట్లాడుతున్న చొల్లేటి ప్రభాకర్

నల్లగొండ టౌన్ : ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ప్రజాస్వామ్య ఫోరం జిల్లా కన్వీనర్ చొల్లేటి ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసేవాళ్లు మతోన్మాదులని అన్నారు. మణిపూర్, ఢిల్లీ, హర్యానా వంటి ప్రాంతాల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలపై హింస పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడేవారిని బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, వంటిపాక యాదగిరి, నలపరాజు సైదులు, అద్దంకి నర్సింహ, ఇస్తారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



కేతేపల్లి : ఆటాపాట నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం 34వ రోజు కొనసాగింది. పాలడుగు చంద్రయ్య, మరియమ్మ, పీరయ్య, వెంకన్న, ఖలీల్, నర్సింహ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆటాపాట

కేతేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం 34వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ కార్మికులు సమ్మె శిబిరం వద్ద తమ సమస్యలపై పాటలు పాడుతూ కోలాటం వేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు ఏడాకుల కోటయ్య, కోటయ్య, జి.ఆశీర్వాదం, మాందాసు సైదులు, వి.లింగయ్య, పి.భద్రయ్య, , కె.మహేష్, సైదులు, పి.వెంకటాచారి, కృష్ణయ్య, బాలశౌరి, ఎం.జానయ్య, దేవయ్య, జ్యోతి, నాగమణి, శోభ, రమణ, కళ్యాణ్, దిలీప్ పాల్గొన్నారు.

మర్రిగూడ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 34వ రోజుకు చేరుకుంది. వట్టిపల్లి హనుమంతు, లింగయ్య, మంజుల, రాములు, రమేష్, ముత్తమ్మ, సునీత, పద్మ, పోచమ్మ, నర్సింహ, శ్రీను, యాదమ్మ, రాములమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో యువత శ్రమదానం

మాదుగులపల్లి: మండల కేంద్రానికి చెందిన యువసేన యూత్ సభ్యులు మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రమదానం చేశారు. ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి ఊడ్చి శుభ్రం చేశారు. సామాజిక బాధ్యతగా యువత, విద్యావంతులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, గురుస్వామి, కరుణాకర్, అనిల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి.. పేదింటి ఆడబిడ్డలకు వరం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు వరం లాంటివని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.46 లక్షల విలువ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 22 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6 లక్షల విలువ గల చెక్కులను మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, తహసీల్దార్ స్వప్న, ఆర్ఐ కుమార్‌రెడ్డి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ



గట్టుప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దారు లావణ్య

చండూరు(గట్టుప్పల్) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చండూరు, గట్టుప్పల్ తహసీల్దారు కార్యాలయాల్లో మంగళవారం గృహలక్ష్మి పథకానికి సంబంధించిన దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి అధికారులు స్వీకరించారు. ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ప్రస్తుతం జత చేయకపోయినా, విచారణ సమయంలో ఇవ్వడానికి అవకాశం ఉందని అధికారులు దరఖాస్తుదారులకు సూచిస్తున్నారు.

మర్రిగూడ : గృహలక్ష్మి పథకానికి మండల వ్యాప్తంగా మంగళవారం 30కి పైగా దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 10 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులకు గురికాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వామి

మునుగోడు : మండల ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా వైద్య సిబ్బంది తగు జాగ్రతలు తీసుకోవాలని ఎంపీపీ కర్నాటి స్వామి అన్నారు. మంగళవారం మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఎంపీపీ సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల్లో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వీధుల్లో, ఇళ్ల ఎదుట నిలిచే నీటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, అదేవిధంగా గ్రామంలో ఏ ఒక్కరికి జ్వరం, ఇతర ఏ జబ్బు వచ్చినా వెంటనే చికిత్స అందించి ఆ వ్యాధి మరొకరికి సోకకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.భాస్కర్ గౌడ్, డాక్టర్ నర్మద, డాక్టర్ సయ్యద్ హజహర్, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దర్వేశిపురం ఆలయం వద్ద భక్తుల సందడి



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కనగల్ : భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి పుట్ట వద్ద భక్తులు పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. రేణుక ఎల్లమ్మ అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఈఓ జల్లేపల్లి జయరామయ్య, అర్చకులు మల్లాచారి, శ్రవణాచారి, దామోదర్, మహేష్, సిబ్బంది చంద్రయ్య, లింగయ్య, నాగరాజు, ఉపేందర్‌రెడ్డి, లింగస్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లెంల యాదమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

నల్లగొండ టౌన్ : నీలగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ పుల్లెంల వెంకటనారాయణగౌడ్ సతీమణి యాదమ్మ ప్రథమ వర్ధంతిని మంగళవారం నల్లగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. యాదమ్మ చిత్రపటానికి రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, బీఆర్ఎస్ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పాశం రాంరెడ్డి, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుంకరి మల్లేష్‌గౌడ్, కటికం సత్తయ్యగౌడ్, గుమ్మల మోహన్‌రెడ్డి, సత్యనారాయణ, కెఎల్ఎం ప్రసాద్, కొప్పు రాంబాబు, సత్యం, యామ దయాకర్, దుబ్బ అశోక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : స్థానిక గడియారం సెంటర్‌లో ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి భిక్షపతి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కట్టెల శివకుమార్, చింతపల్లి బాలకృష్ణ, నవీన్, శ్రీనివాస్, యాదయ్య పాల్గొన్నారు.

కంప్రెషర్ ట్రాక్టర్ స్వాధీనం

నల్లగొండ క్రైం : మండలంలోని దోమలపల్లి శివారులో కంప్రెషర్ ట్రాక్టర్‌ను మంగళవారం రూరల్ పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. విచారించిన పోలీస్‌లు బాట వెంట ఉన్న రాళ్లను పగలగొడుతున్నట్లు గుర్తించి కంప్రెషర్ ట్రాక్టర్‌ను విడుదల చేశారు.

చేనేత కార్మికులకు సన్మానం



చేనేత కార్మికులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నకిరేకల్ : లయన్స్ క్లబ్, నవ్య క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నకిరేకల్‌లో చేనేత కార్మిక దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నవ్య క్లబ్ అధ్యక్షురాలు కందాల శోభాశ్రీనివాస్‌రెడ్డి, జోన్ చైర్మన్లు బొల్లం కృష్ణమూర్తి, రావిరాల అశోక్, ఎస్.రాంమోహన్ రావు, వరకాంతం నారాయణరెడ్డి, దుస్సా సత్యనారాయణ, గుర్రం అంతయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలి

నకిరేకల్ : జిల్లా కేంద్రంలో త్వరలో జరగబోయే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్ కోరారు. నకిరేకల్‌లో మంగళవారం జరిగిన బీజేపీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ, జిల్లా డాకయ్య, పుట్ట వెంకన్న, తాటికొండ రామ్మూర్తి, పాలడుగు నగేష్, అప్పం అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ డానియల్ కుమార్

నల్లగొండ క్రైం : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని ట్రాఫిక్ సీఐ డానియల్ కుమార్ అన్నారు. పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల శ్రీ చైతన్య హైస్కూల్‌లో మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని అన్నారు. మైనర్లు బైకులు నడిపితే చట్టప్రకారం శిక్షార్హులన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు యాదయ్య, జి.త్రిమూర్తి, యాస శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.